క్లుప్తంగా


నేడు రాజన్నదొర నామినేషన్



నామినేషన్ పత్రాలు సిద్ధం చేసుకుంటున్న రాజన్నదొర

సాలూరు: వైఎస్సార్‌సీపీ సాలూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పీడిక రాజన్నదొర శుక్రవారం తొలి సెట్ నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నెల 24న రెండవ సెట్ నామినేషన్ పత్రాలు అందజేయనున్నారు. నామినేషన్ వేసేందుకు అవసరమైన పత్రాలను గురువారం పట్టణంలోని తన నివాసంలో సిద్ధం చేసుకున్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: సీతానగరం వద్ద సువర్ణముఖీ నదీతీరాన వెలసిన లక్ష్మీనృసింహస్వామి గురువారం ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు పి.శ్రీనివాసాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్థానికులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తొమ్మిది వారాల పాటు స్వామికి ముడుపులు చెల్లించి పూజలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

అప్పలనాయుడు సేవలు చిరస్మరణీయం



అప్పలనాయుడు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఎమ్మెల్యే శంబంగి

బలిజిపేట: వెంగాపురం మాజీ సర్పంచ్ జి.అప్పలనాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి బొబ్బిలి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు గురువారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పలనాయుడు సేవలు చిరస్మరణీయమని, ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మనతోనే ఉంటాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అమ్మడమ్మ, ఎంపీటీసీ మురళి, వార్డు మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు, పెత్తందారులకు మధ్య పోరాటం



ఇంటింటి ప్రచారం చేస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ

సాలూరు రూరల్: మే 13న జరగనున్న ఎన్నికలు పెత్తందార్లకు పేదలకు మధ్య పోరాటమని జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మజ అన్నారు. మండలంలోని కూర్మరాజుపేట పంచాయతీ పరిధి పునికినివలస, చిన్నవలస, ముగడవలస గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదేళ్లలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. అలాగే ఓటు ఎలా వేయాలో నమూనా ఈవీఎం ద్వారా అవగామన కల్పించారు. కార్యక్రమంలో కూర్మరాజుపేట మాజీ సర్పంచ్ మన్మథ, తదితరులు పాల్గొన్నారు.

మద్యం బాటిళ్లతో వ్యక్తి అరెస్ట్

మక్కువ: మండలంలోని తూరుమామిడి గ్రామంలో మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్సై పి.నరసింహమూర్తి, సిబ్బందితో కలిసి గ్రామంలో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు అనే వ్యక్తి వద్ద నాలుగు మద్యం ఫుల్‌బాటిళ్లు, ఏడు క్వాటర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గ్రామాల్లో మద్యం విక్రయాలు చేపడితే ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

21న ప్రవేశ పరీక్ష

సాలూరు: మండలంలో పురోహితునివలస ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 21న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అంజలీదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు హాల్‌టికట్లను ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు 9 గంటలకు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

మీకు మంచి జరిగితేనే..

మాకు ఓటు వేయండి



21వ వార్డులో ఎమ్మెల్యే జోగారావు ఎన్నికల ప్రచారం

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు
- మరోసారి అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తా..

పార్వతీపురంటౌన్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మంచి జరిగితేనే ఓటు వేయాలని ఎమ్మెల్యే అలంజగి జోగారావు అన్నారు. పట్టణంలోని 20,21,30 వార్డుల్లో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్‌తో కలిసి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అడుగడుగునా ప్రజలు పూలమాలలు వేసి హారతులిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో ప్రతిపక్షాలను ప్రజలు తరిమి కొట్టడం ఖాయమన్నారు. పేదల పక్షాన నిలబడుతున్న జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి, మరింత సంక్షేమం కోసం మీ అమూల్యమైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా డాక్టర్ గుమ్మ తనూజారాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈనెల 24న నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించామన్నారు. మరోసారి తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇస్తే సీఎం జగనన్న సహకారంతో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో మీకు మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయండని ధైర్యంగా అడుగుతున్న దమ్మున్న నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. కుల, మతాలు, వర్గాలకు అతీతంగా.. అర్హత ఉన్న ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలను అందించినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండపలిల బాలకృష్ణ, పార్టీ ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, వార్డు కౌన్సిలర్ ఎస్.లక్ష్మీపార్వతీ, నిమ్మకాయల సుధీర్, రణబేరి చిన్నంనాయుడు, జయంతి, జె.దివ్య, యడ్ల త్రినాథ, మజ్జి నాగమణి, గోగు గాయత్రి, వివిధ వార్డుల కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారథులు, స్టేట్ డైరెక్టర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

ఫ్యాన్ గుర్తుపై ఓటేయండి



బలిజిపేట: చెల్లెంపేటలో ఇంటింటా ప్రచారం చేస్తున్న జడ్పీటీసీ రవికుమార్, నాయకులు

బలిజిపేట: రానున్న ఎన్నికలలో ఫ్యాను గుర్తుపై ఓటువేసి రాష్ట్రంలో సుభిక్షపాలనను అందుకోవాలని జడ్పీటీసీ ఎ.రవికుమార్ కోరారు. చెల్లెంపేటలో గురువారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందని, రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందన్నారు. ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు, సేవలు అందజేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో పథకాల కోసం, ప్రభుత్వ సేవల కోసం ఎన్ని ఇబ్బందులు పడాల్సి వచ్చేదో గుర్తుచేసుకోవాలని కోరారు. ఈ సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మే 13న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ శ్రీరాములునాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, మండల వ్యవసాయ సలహా సంఘం అధ్యక్షుడు గంగయ్య, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, ఎ.గోపాలకృష్ణ, జి.రామినాయుడు, వెంకటి నాయుడు, అప్పలనాయుడు, ఎ.పోలినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



సాలూరు రూరల్: ఎంపీడీఓ ఫణీంద్రకుమార్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

సాలూరు రూరల్: గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని పలు గ్రామ సచివాలయాల్లో సేవలందిస్తున్న 27 మంది వలంటీర్లు గురువారం ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ఎంపీడీఓ ఫణీంద్రకుమార్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య అనుసంధాన కర్తలుగా ఉంటూ నిస్వార్థ సేవలందిస్తున్న తమపై ప్రతిపక్ష కూటమి నాయకులు చేస్తున్న అసత్య ప్రచారానికి నిరసనగా రాజీనామాలు చేసినట్లు చెప్పారు. ఇకపై జగనన్నకు మద్దతుగా ఎన్నికల ప్రచారంలో నేరుగా పాల్గొంటామని స్పష్టం చేశారు. కాగా, ఇప్పటివరకు మండలంలో 135 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు.

పార్వతీపురంటౌన్: మండలంలోని నర్సిపురం, సంగంవలస, పుట్టూరు సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 30 మంది వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు తమ రాజీనామా పత్రాలను అందజేశారు. సుమారు ఐదేళ్లుగా ప్రజలకు సేవలందిస్తున్నామని, రాజకీయ దురుద్దేశంతో ప్రతిపక్షాలు తమ సేవలను అడ్డుకున్నాయని వాపోయారు. దీనికి నిరసనగా రాజీనామాలు చేసినట్లు చెప్పారు. ఇన్నాళ్లు గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అందించామని, ఇప్పుడు గడపగడపకు వెళ్లి జగనన్నకు ఓటు వేయాలని ప్రజలను అడుగుతామన్నారు.



పార్వతీపురంటౌన్: ఎంపీడీఓ అకీబ్ జావేద్‌కు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

అప్రమత్తతతో అగ్నిప్రమాదాల నివారణ



సాలూరు: డెమో ప్రదర్శనతో అవగాహన కల్పిస్తున్న అగ్నిప్రమాదాల సిబ్బంది

పార్వతీపురంటౌన్: అగ్నిప్రమాదాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి పి.పైడిరాజు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని గ్యాస్ గోదాంల వద్ద ప్రమాదాల నివారణపై గురువారం సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రమాదాలకు కారణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అప్రమత్తంగా ఉంటే ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించవచ్చన్నారు.

సాలూరు: అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన పెంపొందించుకోవాలని అగ్నిమాపక అధికారి సుధాకరరావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాస గ్యాస్ ఏజెన్సీ వద్ద అగ్నిప్రమాదాల నివారణపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్, విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రమాదాలు జరిగినపుడు వాటిని ఎలా నివారించాలో ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది సింహాచలం, సీతంనాయుడు, సీతారాం, సురేష్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్: అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వైఎస్సార్‌సీపీని వీడే ప్రసక్తే లేదు

- టీడీపీ నాయకులు బలవంతంగా కండువాలు వేశారు
- వైఎస్సార్‌సీపీలో చేరిన డెప్పివలస గ్రామస్తులు



ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్న డెప్పివలస గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: టీడీపీ నాయకులు బలవంతంగా కండువ వేశారని పార్వతీపురం మండలం డోకుశీల పంచాయతీ డెప్పివలస గ్రామానికి చెందిన స్థానికులు తెలిపారు. టీడీపీ నాయకులు బుధవారం తమ గ్రామానికి వస్తే మా ఊరు ఆచారం ప్రకారం వారిని గౌరవించామని, ఆ సమయంలో వారు బలవంతంగా టీడీపీ కండువా వేసి మమ్మల్ని పార్టీలో చేరినట్లు చిత్రీకరించి చూపడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే జోగారావుని కలిసి జరిగిన విషయం చెప్పారు. తాము ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని, పార్టీని వీడే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతులమీదుగా తిరిగి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలని, లేదంటే ఇటువంటి ఘటనలు ఎదురవుతాయన్నారు. కూటమి నేతల కుతంత్రాలను తిప్పికొట్టాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలంతా సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన సర్పంచ్ జయప్రకాష్

సొంతగూటికి జయప్రకాష్

పెద్దింపేట సర్పంచ్ అలజంగి జయప్రకాష్ ఎమ్మెల్యే అలజంగి జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీకీ కండువా కప్పుకున్నారు. టీడీపీ అభ్యర్థి బోనెల విజయ్‌చంద్ర ఆలోచన విధానం నచ్చక తిరిగి సొంత పార్టీకి వచ్చినట్లు ఆయన తెలిపారు. జయప్రకాష్ సొంత గూటికి చేరడంతో పార్టీ మండల అధ్యక్షుడు పాలవలస మురళీకృష్ణ, జెడ్పీటీసీ రవికుమార్, పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



పార్వతీపురంటౌన్: ఎమ్మెల్యే జోగారావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన యువత

వైఎస్సార్‌సీపీలో చేరిక

పార్వతీపురంటౌన్: పార్వతీపురం, బలిజీపేట, సీతానగరం, పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో పలువురు యువత గురువారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారికి ఎమ్మెల్యే జోగారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమాన్ని, అభివృద్ధిని కళ్లారా చూశామని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలనే లక్ష్యంతో తామంతా పార్టీలో చేరినట్లు చెప్పారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే జోగారావుకు మద్దతుగా ప్రచారం చేస్తామని, రానున్న ఎన్నికల్లో వైఎస్సారసీపీ విజయమే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు.

కార్యక్రమంలో ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

పృథ్వీరాజ్‌కు అభినందన



సివిల్స్ ర్యాంకర్ పృథ్వీరాజ్‌ను అభినంధిస్తున్న ఎంఈఓ సింహాచలం

పార్వతీపురంటౌన్: ఇటీవల విడుదలైన సివిల్స్ ఫలితాల్లో 493 ర్యాంక్ సాధించిన దొనక పృథ్వీరాజ్ ఈ ప్రాంత యువతకు ఆదర్శంగా నిలిచారని ఎంఈఓ, రాష్ట్ర ఎంఈఓ అసోసియేషన్ అధ్యక్షుడు సామల సింహాచలం అన్నారు. పట్టణంలో నివాసముంటున్న పృథ్వీరాజ్ ఇంటికి గురువారం వెళ్లి అతన్ని అభినందించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే సివిల్ సర్వీసెస్ పరీక్షలో పార్వతీపురం యువకుడు మంచి ర్యాంకు సాధించడంతో ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. నిరుద్యోగ యువత పృథ్వీరాజ్‌ను ఆదర్శంగా తీసుకుని ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. సీతానగరం ఎంఈఓ ముర్వల వెంకటరమణ, ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం మన్యం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.నారాయణరావు తదితరులు ఉన్నారు.

అభ్యర్థి ఖాతాలో ఖర్చు నమోదు చేయాలి



సూచనలిస్తున్న నియోజకవర్గ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్

సీతంపేట: ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి ప్రచార ఖర్చులను అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకుడు రమాకాంత్ ప్రధాన్ అన్నారు. గురువారం నియోజకవర్గంలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారి కల్పనాకుమారి సమక్షంలో వ్యయ పరిశీలన బృందాలతో సీతంపేట ఐటీడీఏ ఆర్‌వో చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఖర్చులను ఎలా నమోదు చేస్తున్నారని అడిగారు. ధరల పట్టికను పరిశీలించారు. సంబంధిత రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. నోడల్ అధికారి శ్రీరామమూర్తి, లైజన్ అధికారి కృష్ణ పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు



సీతానగరం: వాహనాలను తనిఖీ చేస్తున్న ప్రత్యేక బృందాలు



సాలూరు: వాహన తనిఖీలు చేస్తున్న ఎంవీఐ ప్రసాద్

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో మద్యం, నగదు, ఇతర సామగ్రి తరలింపుపై నిఘా పెట్టినట్లు ఎస్ఎస్‌టీ అధికారి ఎన్.కృష్ణుడు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్ సమీపంలో హనుమాన్ జంక్షన్ వద్ద గురువారం పోలీసు సిబ్బంది సహకారంతో వాహన తనిఖీలు చేపట్టారు. హనుమాన్ జంక్షన్ వద్ద రాష్ట్ర రహదారిలో చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి మూడు షిఫ్టుల్లో ఎస్ఎస్‌టీ బృందాలు తనిఖీలు చేపడతాయన్నారు. వాహనచోదకులు సహకరించాలని కోరారు. మద్యం, నగదు, ఇతర సామగ్రి రవాణా చేసేవారు అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని, లేదంటే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు.

సాలూరు: పట్టణంలో సాలూరు–మామిడిపల్లి రోడ్డులో మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. పరిమితికి మించిన లోడుతో ప్రయాణిస్తున్న వాహనాలు, రిఫ్లెక్టర్లు లేని వాహనాలతో పాటు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై అపరాధ రుసుం విధించారు. వాహనదారులంతా ట్రాఫిక్ నియమాలు కచ్చితంగా పాటించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మోటార్‌వెహికల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, తదితరులు ఉన్నారు.

స్ట్రాంగ్‌రూంల భద్రతపై ఆర్డీఓ ఆరా



స్ట్రాంగ్ రూంలను పరిశీలిస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను ఆర్డీఓ, పార్వతీపురం నియోజకవర్గ ఎన్నికల అధికారి హేమలత గురువారం పరిశీలించారు. ఈవీఎంల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్ట్రాంగ్‌రూంలలో సీసీ కెమెరాలు ఏర్పాటుపై ఆరాతీశారు. పరిసరాలను శుభ్రంగా ఉంచాలని, ఇతరులను పరిసరాల్లోకి అనుమతించొద్దని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల నుంచి వచ్చే రూట్‌మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకొని విధులు నిర్వహించాలన్నారు. ఆమె వెంట తహసీల్దార్ కె.ఆనందరావు, ఆర్ఐ రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

ప్రారంభమైన నామినేషన్ల ప్రక్రియ

- తొలిరోజు నామినేషన్లు నిల్

సాలూరు: ఎన్నికల నామినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైంది. పట్టణంలోని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరణకు ఏర్పాట్లు చేశారు. ఐటీడీఏ పీఓ, సాలూరు అసెంబ్లీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్ నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆర్వో కార్యాలయ సమీపంలో పోలీసు బందోబస్తుతో పాటు బారికేడ్లు ఏర్పాటు చేశారు. తొలిరోజు నియోజకవర్గంలో ఒక్క నామినేమిషన్ కూడా రాలేదని ఎన్నికల రిటర్నింగ్ అధికారి తెలిపారు.

సీతానగరం: సార్వత్రిక ఎన్నికల నమినేషన్ ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభమైనట్లు ఎంసీసీ(ఎంపీడీఓ) ఎం.ఈశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో, కార్యలయ నోటీస్ బోర్డులో ఏర్పాటు చేసిన ఎన్నికల నోటిఫికేషన్ పత్రులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..మండలంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్(ఆర్డీఓ) కె.హేమలత ఆధ్వర్యంలో నామినేషన్ల స్వీకరణ జరుగుతుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేసే వ్యక్తులు ఎన్నికల నిబంధనలకు లోబడి నడుచుకోవాలని, లేనిపక్షంలో పోటీలో ఉన్న అభ్యర్థులకు ఆర్థికపరమైన సమస్యలు వస్తాయని తెలియజేశారు. ప్రచారానికి ముందస్తుగా అనుమతులు పొందాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే రాజకీయ పార్టీ నాయకులకు ఎన్నికల ప్రవర్తన నియమావళిని అఖిల పక్ష సమావేశాల్లో వివరించడం జరిగిందన్నారు.



సాలూరు: అధికారులతో మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి విష్ణుచరణ్



సాలూరు: ఆర్వో కార్యాలయం వద్ద పోలీసుల బందోబస్తు



సీతానగరం: ఎన్నికల నోటిఫికేషన్‌ను పరిశీలిస్తున్న ఎంసీసీ ఈశ్వరరావు